# కిటికీ

ప్రకాశం ఒక్కడే కారు వెనుకసీట్లో కూర్చుని వెళ్తూ వంతెనమీద నుంచే తూరుపువైపు ఒక గుడిని చూశాడు. నలుపెక్కినా ఆ గుడి ఎండలో మెరుస్తూ కనిపిస్తోంది. తన ప్రస్తుత లోకమంతా మరచి, చప్పున పాత రోజుల్లో చిక్కుకున్నాడు. ఆ గ్రామదేవత గుడిముందున్న మూడు వరసల చెక్కిన రాతిపలకల మెట్లమీద కూర్చున్న రోజులు జ్ఞప్తికి వచ్చినాయి. తను ఒకప్పుడు యువ్వనం తొలిరోజులలో ఆరునెలలపాటే నివశించిన ఇల్లూ.. ఆ ఇంటి కిటికీ నుంచి మళ్లీ ఒకసారి ప్రకృతివైపు చూడాలనిపించింది. అది నిత్యం తెరచి ఉన్న కిటికీ. వెదురుబొంగులతో చేసినది. తలుపులు లేవు. ఆ గది పడమటి గోడ మధ్యలో పొదిగి ఉన్నది.

కారును ఊర్లోకి జాగ్రత్తగా తీసుకువెళ్లమని డ్రైవర్‌తో చెప్పాడు, ఇంకా ఆ పాత మట్టివీథులే, ఆ పాకలే అనుకుంటూ...తీరా ఊరు మారిపోయింది. కంకరరోడ్డు మీద కారు నిరాఘాటంగా కదులుతోంది. ఇటూ అటూ పాకలకన్నా పెంకుటిళ్లు, డాబా ఇళ్లు, కొన్ని రెండంతస్థుల ఇళ్లే ఎక్కువగా ఉన్నాయి. ఏటి ఒడ్డువేపు కారు కదులుతుండగానే ఏ కలెక్టరో, ఎవరో పెద్దవాడు వచ్చాడని వచ్చిన ఎందరో కారు ఆగగానే చేరారు. ఒకప్పుడు తను పనిచేసిన బడి బదులు ఒక పశువుల దొడ్డి ఉంది.

"ఇక్కడ స్కూలుండేది. ఏదీ?" ప్రశ్నించాడు.

"హైకూలు అయింది, బాబూ! ఊరు చివరకు వెళ్లింది!" అన్నాడొకడు.

"ఎవరు బాబూ తమరు?" ఒకడు సవినయంగా అడిగాడు.

"నన్ను పోల్చుకోలేదా?" అని తిరుగుప్రశ్న వేశాడు ప్రకాశం. ఆ అడిగినవాడు తన బడిలో చదువుకున్నవాని తండ్రేనని ప్రకాశం పోల్చుకున్నాడు. ఈ సూటు, బూటు, ఈ పెరిగిన శరీరం, కళ్లకు నల్లద్దాలు... ఈ అట్టహాసం చూసి ఎవరు మాత్రం ఇతను నలభయ్యేళ్ల క్రితం ఈ వూర్లో కొద్ది నెలలుండిన ప్రకాశం మేష్టారని ఊహించగలరు? వీళ్లు తనెవరో తెలుసుకోకపోవడమే మంచిదనుకుని..

"ఇక్కడ యేటి ఒడ్డున ఒక ఇల్లుండేది. పడమటివేపు తలుపుల్లేని కిటికీ ఉండేది. ఆ ఇల్లు కనపడలేదు!" అన్నాడు.

"ప్రకాశం మేష్టారుండే ఇల్లా? అదా? రా, బాబూ చూపిస్తాను!" అని ఒక వయసుమళ్లినవాడు యేటి ఒడ్డుకు నడిపించి,

"అదిగో, ఆ పారుతున్న యేటి కొనముందు ఇసకపర్ర చూశారా? అక్కడ ఉండేది. వరదలకు ఒడ్డు కూలి ఆ వరసలనున్న ఇళ్లన్నీ యేటిలో కలిసిపోయాయి!" అన్నాడు.

కాసేపు నిల్చుని అలా చూసి తిరిగి కారు దగ్గరకు వచ్చేసరికి గుమిగూడిన గ్రామస్థుల ఎదురుగా ఒకావిడ తల కొట్టుకుంటూ తనముందు చెయ్యిచాచి అడుక్కుంటోంది. ఆకలి వయసును మింగి ఎముకలగూడును ప్రాణంతో


## ప్రతిక్షణం ప్రశాంతంగా ఉండండి

మనోవ్యాధికి మాటల ద్వారా చికిత్స చేయవచ్చనేది అనాదిగా వస్తున్న ఆచారమే. పూర్వం రోజుల్లో ఋషులు, మహారాజులు, మత ప్రవక్తలు మనతరంలో అమ్మమ్మలు, తాతయ్యలు ఇలా... కౌన్సిలింగ్ చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు వాళ్లంతా చేసే స్థితిలో లేరు. ఇప్పుడు వారికి కూడా కౌన్సిలింగ్ అవసరమయింది. అందుకే ఇప్పుడు విదేశాల్లో వేలాది కౌన్సిలింగ్ క్యాసెట్లు వివిధ సమస్యలకు వచ్చాయి. వాటిని ఆధారంగా చేసుకుని తెలుగులో ప్రముఖ సైకాలజిస్టు, హిప్నాటిస్టు బి.వి. పట్టాభిరామ్ గళంతో తయారుచేశారు. ఈ క్రింది క్యాసెట్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. లక్షలాదిమంది ప్రయోజనం పొందిన వీటిని మీరుకూడా వినండి.

1. రిలాక్స్-రిలాక్స్ (ఇంగ్లీషు)
2. రిలాక్స్-రిలాక్స్ (తెలుగు)
3. జ్ఞాపకశక్తి- హిప్నాటిజం
4. ధైర్యం - హిప్నాటిజం
5. ఆత్మవిశ్వాసం
6. ఇన్‌ఫీరియార్టీ కాంప్లెక్స్
7. జాకబ్‌సన్ రిలాక్సేషన్ (తెలుగు)
8. జాకబ్‌సన్ రిలాక్సేషన్ (ఇంగ్లీషు)

**ఏ క్యాసెట్ ఖరీదైనా రూ. 75/- మాత్రమే (నోట్స్‌తో సహా)**

ఈక్యాసెట్లు, పుస్తకం రిజిష్టరు పోస్టులో మాత్రమే పంపబడతాయి. ఒక క్యాసెట్‌కు 25 రూపాయలు. ప్యాకింగ్ మరియు పోస్టు ఖర్చుల నిమిత్తం అదనంగా పంపాలి. మొత్తం సొమ్మును ముందుగా మనియార్డరు ద్వారా లేదా ప్రశాంతి కౌన్సిలింగ్ సెంటర్ పేరుమీద డిడి ద్వారా పంపాలి. వి.పి.పి. పద్ధతి లేదు / మీరు పంపించవలసిన చిరునామా :



బి.వి. పట్టాభిరామ్

E-mail: bvpram @ hotmail.com. Website : pattabhiram.com

**ప్రశాంతి కౌన్సిలింగ్ సెంటర్**

E-1, సామ్రాట్ కాంప్లెక్స్, ఎ.జి. ఆఫీసు ఎదురుగా, సెక్రటేరియట్ రోడ్, హైదరాబాద్-500 004, ఫోన్స్: 3396090, 3233232

మిగిల్చినట్లుంది. కళ్లు లోతుకుపోయి ఏ క్షణాన చచ్చిపోతుందో నన్నట్లు కనిపించింది. ప్రకాశం పర్సునుంచి పది రూపాయల కాగితం తియ్యగానే..

"లచ్చిముండా! ఆ బాబు దయతలచాడే! రూపాయి కాదు, పది రూపాయలు!" అన్నాడొకడు. చెయ్యి చాచిన ప్రకాశం ఆ పది రూపాయల కాగితాన్ని అలా పట్టుకునే

"ఈవిడకు ఇల్లు లేదా?" అన్నాడు.

"అది ఆ ప్రకాశంబాబు ఇంటి పక్కనే ఉండేది. ఆ ఇల్లూ యేటిలో కలిసిపోయింది!"

ఈ మాటలు వినగానే పది రూపాయల నోటును పర్సులో తిరగిపెట్టేసి, నూరు రూపాయల నోటును లచ్చికి అందిచ్చాడు.

"నీ అదుష్టం పండిందే! ఈ డబ్బుతో బాగా తిని సచ్చిపోయే, ముండా!" అన్నాడొకడు.

"మనం సేసిన పాపాలకు శిచ్చ ఇక్కడే పట్తాం. లచ్చికీ తప్పలేదు!" అని ఒక వయుసుమళ్లినవాడు వ్యాఖ్యానించాడు. ఈ నూరు రూపాయల దానం ఎంత వేగిరం పూర్లోకి పాకిపోయిందో గానీ వరస అడుక్కోడానికి ఎందరో చేరారు. వాళ్లని పొమ్మని లచ్చి అరుస్తోంది. ప్రకాశం తలో పది రూపాయలిచ్చినా వాళ్లు ఆశించినంతగా దొరకలేదని విలవిల్లాడిపోయారు. కారును తిప్పమన్నాడు. తన సంచిలోనున్న రెండు బిస్కెట్ల పాకెట్లు తీసి లచ్చికి అందిచ్చి కారెక్కాడు.

కారులో కూర్చున్నా కారు ఎదుట చూసిన అభాగ్యురాలి ఆర్తనాదం వినిపిస్తోంది. ఆ దైన్యమైన రూపు అతన్ని ఒక్క ఊపు ఊపి ఇంకా కదలిస్తూనే ఉంది. తలలో నొప్పి, మనసులో వేదనగా గుచ్చుకుంటోంది. ఈ ఒక్క సంఘటన తనలో ఇన్నాళ్లూ పొరపాటునైనా ఆలోచించని గతాన్ని

**బలివాడ కాంతారావు**

గుర్తుకు తెప్పించి, ప్రస్తుత నిజజీవితంపై రోత పుట్టించి, భవిష్యత్తు ఎలా ఉంటుందోనన్న భయాన్ని రేకెత్తించింది. ఈ సిరిసంపదల తరువాత గడించవలసిందేముందన్న జిజ్ఞాసతో సతమతమవుతున్నాడు. పట్నంలో తన పని యాంత్రికంగా పూర్తయింది. ఇంత దూరం వచ్చి తనేం సాధించాడు? అక్కడ మూగిన వ్యాపారస్థులతో, తను తయారుచేయించే సామానుల అమ్మకాలు, లాభాలు, వ్యాపారంలో పోటీని ఎదుర్కొనే ఉపాయాల గురించే ముక్తసరిగా మాట్లాడాడు. ఆ రాత్రి ఉండటానికి అక్కడే హోటల్లో ఏర్పాటు చేసినా, భోంచేశాక అక్కడ ఉండబుద్ధి పుట్టలేదు. తిరుగు ప్రయాణం సాగించాడు.

కారు ఆ గ్రామం దగ్గరకు రాగానే రోడ్డుపక్కన ఆపించాడు. వెన్నెల్లో యేరు, యేటికి ఇటూ అటూ ఆనుకున్న ఇసుకపర్రలు, పశ్చిమానికి పచ్చని తోటలు. అప్పటికే ఆ ఊరు నిద్రపోయింది. ప్రశాంతమైన వాతావరణం. రోడ్డు దిగి యేటి ఒడ్డున పడ్డాడు. మెల్లగా నడుచుకుంటూ ఎక్కడైతే ఒకప్పుడు తన కిటికీ ఇల్లు ఉండేదో అక్కడే ఇసుకలో కాళ్లు చాచుకుని కూర్చున్నాడు. ఆ రోజుల్లో కొత్త యవ్వనం... కళ్లకు అంతా అందంగా కనిపించినా, ఏ అందం తనలో కోరికలను ప్రేరేపించలేదు. చూశాడు, ఆనందించాడు. స్కూల్లో పిల్లలంత అమాయకమైన మనస్తత్వం. తల వంచుకుని స్కూలుకు వెళ్లి పాఠాలు చెప్పి, మళ్లీ తల వంచుకునే వచ్చేవాడు. వంట చేసుకుని ఏదో తనకు నచ్చిన పుస్తకం చదవడంలో మునిగిపోయేవాడు. ఆ ఇంట్లో తనను ఆకర్షించింది ఆ కిటికీయే. ఆ కిటికీనుంచి ముఖ్యంగా రాత్రిళ్లూ, అందులో వెన్నెల రాత్రులు అలా నిల్చుని


పంచశీల్
జూనియర్ కాలేజీ & B.Ed. కాలేజీ
(ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ)
నిర్మల్, జిల్లా : ఆదిలాబాద్
NIRMAL-504 106
కో-ఎడ్యుకేషన్ - రెసిడెన్షియల్

కార్యాలయములు : న్యూబస్టాండ్ మరియు గాజులపేట్, నిర్మల్-504 106
ఫోన్ : 45852

చూస్తూండడం సరదా! ఆ ప్రకృతి విన్యాసం, ఆకాశంలో పక్షుల కదలిక, సూర్యాస్తమయం, గలగల పారే యేరు, వెన్నెల ... వెన్నెల్లో అప్పుడప్పుడూ నీటినుంచి యెగిరే చిరు చేపల ఆటలు ... చంద్రుడు పూర్ణేందుబింబానగ, ఆ దిగువ పచ్చని చెట్లు అతివ అంగాలుగా ఊహించుకునేవాడు. ఒక ఆదివారం ఉదయపుటెండ నీటిపై పడుతుండగా చూస్తే ఒక పడుచు బాహాటంగా నీటిలో చేపలా ఈదుతూ స్నానం చేస్తోంది. చూడకూడదని ముఖం తిప్పుకున్నా మళ్లీ మనసు అటువేపే లాగింది. ఆ తడి బట్టలతో, ఆమె ఒడ్డు ఎక్కుతూ తన కిటికీవేపే చూస్తోంది. తొలిసారి ఆడదానివైపు తల వంచకుండా చూశాడు. ఆ శరీర పొందిక, ఆ బంగారు చాయ, తనలో ఒక విధమైన సంచలనాన్ని సృష్టించింది. దానికితోడు ఆమె తనవేపే కళ్లప్పజెప్పి చూసి ఒక చిరునగవుతో పూలగుత్తు అందించినట్లు సత్కరించింది. తనలో ఒక కోరిక అంకురించిన మొదటి రోజు అది. ప్రకృతే కాదు, దాన్ని ప్రత్యామ్నాయంగా ఆడదే మగాడ్ని ఆకర్షించగలదని తొలిసారి తెలుసుకున్నాడు. నాలుగు రోజుల్లో ఆ కోరిక.. ఆమెను పొందాలనే వాంఛ మనసులో రేగింది. ఓ మగాడు తాళికట్టి ఆమెపై అధికారం సంపాదించుకున్నాడు. ఇది జరగని పని అనిపించింది ప్రకాశానికి.

ఇక తను ఈ కిటికీ గుండా.. ప్రకృతి అందాలనే చూసి, ఊహించి, కాంక్షించి, ఎప్పుడో తనూ ఒక గృహస్థుడు కావాలని అనుకున్నాడు. అంతలో ఒక రాత్రి ... పడమటి ఆకాశంలో శుక్రగ్రహం మెరిసిపడిపోతోంది. కొంతసేపటికి వెన్నెల ఆకాశమంతా అల్లింది. ఆ వెన్నెల చల్లదనం ప్రకృతిని పులకరింపజేస్తోంది. ఆ వెలుగు, దీపం ఆర్పిన తన గదిలోనికే చొచ్చుకుపోయి మసక వెలుగుతో ముసిముసిగా నవ్వుతున్నట్లుంది. ఇంతలో పెరటి తలుపు మెల్లగా తట్టిన శబ్దం. తలుపు తీశాడు. చప్పున ఆమె లోనికి మెరుపులా వచ్చి లో గడియ వేసింది. ఇన్నాళ్లూ కిటికీలోనుంచి చూసిన ప్రకృతి అందమంతా ఈ ఒక్క యువ్వనిలోకి చొచ్చుకుని తన ఎదురుగా నిల్చున్నట్లుంది. ఆమె అలంకరించుకుని అలరించడానికే వచ్చినట్లు మీద చెయ్యి వేసింది. గుసగుసలతో మొగుడు పట్నం బండి తోలుకువెళ్లాడని, మరుసటి రోజు సాయంత్రంవరకూ రాడని అతనిలోని భయాన్ని పారద్రోలింది. ఏటి ఒడ్డున తడి బట్టలతో చూసిన అందం ఇప్పుడు ఎదురుగా బాహాటంగా నిల్చుంది. వాత్స్యాయనుని కామసూత్రాల్లో లేనివీ, కోణార్క శిల్పసుందరిలకు చేతకానివీ ఎన్నో కొత్త భంగిమలతో ఆ రాత్రంతా అతనిని అల్లుకుని కామకేళి నేర్పింది.

నరాల ఆవేశం తగ్గి, అలసి సొలసిపోయేసరికి తొలి కోడి కూసింది. ఆమె మెల్లగా తలుపు తీసుకుని వెళ్లిపోయింది. కోరికలు అంత వేగిరంగా తరిగిపోవు. ఆలోచించినకొద్దీ పెరుగుతూనే ఉంటాయి. కానీ ఈ పెరిగే కోరికలు మనసులో ఒక విధమైన భయాన్ని పొగలా రగిలిస్తాయి. ఆ పొగ మంటలా మారితే జీవితం అల్లకల్లోలమైపోతుంది. ఆ రాత్రికి ముందు ప్రకాశం తను రోజూ కిటికీ నుంచి చూసే ప్రకృతి అంత పవిత్రుడు. కల్మషం లేనివాడు. విద్యాదానం చేసేవాడు, కోరికల ఊబి అంటూ ఉంటుందని ఎరుగనివాడు. వెన్నెల, వాన, గాలి, ఆకాశం, ఎండ ఇవన్నీ తనకు ఆనందాన్నిచ్చాయేగానీ, అవి కోరికలను సృష్టించలేదు. ఇవన్నీ ఏకమై ఒక గాలివానలా ఈ లచ్చి రూపంలో వచ్చి తనను చుట్టుముట్టేసాయనుకున్నాడు. ఈ కోరిక మళ్లీ మళ్లీ తీర్చుకోవాలనుకుంటే, ఆ అవకాశం సన్నగిల్లి పిరికితనం, భయం మనసులో చోటుచేసుకుంది. లచ్చి మగడు నీలయ్య ఇలాంటి అలాంటివాడు


## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ లిమిటెడ్, నిజామాబాద్

### "నిరాశ్రయులకు ఆశ్రయం : రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఆశయం"

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము గ్రామాలలో మరియు పట్టణాలలో నివసించుచున్న బలహీనవర్గాల వారికి గ్రామీణ గృహ నిర్మాణ పథకం, పట్టణ గృహ నిర్మాణ పథకముల క్రింద ఇళ్లు మంజూరు చేయుచున్నది. గ్రామీణులకు రూ. 11,000/- మరియు పట్టణవాసులకు రూ. 12,000/- సంవత్సర ఆదాయం కల వారికి, శాశ్వత నివాసాన్ని కల్పించే ఉద్దేశంతో గృహ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు పరుస్తున్నది. గృహ నిర్మాణ పథకము ద్వారా జిల్లాలో గృహాలను చేనేత కార్మికులకు, మత్స్య కార్మికులకు, బీడీ కార్మికులకు, తుపాను బాధితులకు, అత్యాచారానికి గురైన షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల వారికి, జోగినులకు, వితంతువులకు, వికలాంగులకు మరియు వెట్టిచాకిరీనుండి విముక్తులైన వారికి ఇళ్లను నిర్మించడం జరుగుతుంది.


1979-80 సం॥లనుండి 15.7.2000 వరకు జిల్లాలో వివిధ పథకముల క్రింద 1,40,761 గృహములు చేపట్టి 1,16,416 గృహములు పూర్తి చేయబడినవి. గృహ నిర్మాణం చేపట్టే సమయంలో ఈ క్రింది తెలుపబడిన నిబంధనలు పాటించవలెను.

★ ప్రతి ఇల్లు తప్పనిసరిగా ఆర్.సి.సి. స్లాబ్‌తో ఇంటి పైకప్పు నిర్మించవలెను.
★ 1998-99 నుండి ప్రతి గృహానకు మరుగుదొడ్డిని అనుబంధంగా చేసి యూనిట్ విలువ నుండి రూ. 25,000/- కేటాయించబడును.
★ గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో 20 చ॥మీ॥ మరియు పట్టణ గృహ నిర్మాణ పథకంలో 23.40 చ॥మీ॥ ఇళ్ల నిర్మాణము చేపట్టవలెను. ఎట్టి పరిస్థితులలో కొలత తగ్గించకూడదు.
★ ప్రభుత్వము నిర్ణయించిన పైపు డిజైనులోనే ఇళ్లను నిర్మించవలెను.
★ 50% షెడ్యూలు కులాలు / షె.తెగలకు, 33% వెనుకబడిన తరగతులకు, 10% ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు మరియు 7% మైనారిటీలకు ఇళ్లను కేటాయించడం జరుగుతుంది.
★ 3% వికలాంగులకు ప్రతి కేటగిరినందు కేటాయించబడును.
★ నిర్మిత కేంద్రంలో తయారవుతున్న సిమెంట్ దర్వాజాలు, కిటికీలు, లెంటళ్లు, ఇటుకలు మొదలగునవి ఇంటి నిర్మాణంనకు తప్పనిసరిగా వాడవలెను. దీనివలన 30% ఖర్చు ఆదా అవుతుంది మరియు త్వరితముగా ఇళ్లు పూర్తి చేయవచ్చును.
★ ఎలాంటి మధ్యవర్తిత్వము, కాంట్రాక్టు పద్ధతులు లేకుండా లబ్ధిదారుడు తన ఇంటిని స్వయముగా నిర్మించుకొనును.
★ ఇంటి నిర్మాణం పూర్తి అయిన మరుసటి నెలనుండి తీసుకున్న రుణమునకు (గ్రామీణ గృహానకు 120, పట్టణ గృహానకు రూ. 240/-) నెలసరి వాయిదాల పద్ధతులలో గృహ నిర్మాణ శాఖ నిర్ణయించబడిన శిస్తు వాయిదా ప్రకారం 7% వడ్డీతో సహా చెల్లించి రసీదు పొందవలెను.

**Ch. వెంకటేశ్వరరెడ్డి** B.Tech.,
జిల్లా మేనేజర్ (గృహ)

**శ్రీ శశాంక గోయల్** I.A.S.,
జిల్లా కలెక్టర్

కాడు. భయంకరుడు. మీసాలు మెలివేసి రెండు చెవుల్లో రెండు బంగారు కమ్మలని ధరించినవాడు. మాట్లాడితే అదుపు ఆజ్ఞలను ఏకరవు పెట్టే కఠోరమైన గొంతుగలవాడు. అనుమానం వస్తే ఎదుటివాళ్లపై రాళ్ల వర్షం కురిపిస్తాడు. తగిలితే తల పగిలి రక్తం కారవలసిందే! లచ్చికి ప్రకాశం అంటే ప్రేమ.. పూనకంలా పట్టింది. దాన్ని భరించలేదు. మళ్లీ గడి తప్పుతుంది. అది తెలిసిపోయినప్పుడు దాని నెత్తురే కాదు, తన నెత్తురూ చూస్తాడు. ఈ చెయ్యరాని పని చెయ్యటం వలన తనకూ భయం పుట్టుకొచ్చింది. ఈ స్కూల్లోని ఉద్యోగంలో వచ్చే జీతమెంత? తెచ్చే కీర్తికన్నా అపకీర్తే పెరిగిపోకముందే ఏదో ఆలోచించాలి. ఈ సంకట పరిస్థితిని వదిలించుకోడానికి భయంతోనే ఆ ఊరును వదిలేశాడు.



ఈ తలుపులు లేని కిటికీ ఇంటిలో ఏ కోరికలూ భయం లేకుండా కాలుపెట్టాడు. ఈ ఇంటిని కోరికలూ, భయంతోనే వదిలాడు. ఈ కోరికతో నాదీ, నేను అన్న భావన రానురానూ పెరిగింది. కొన్నాళ్లు ఉద్యోగంలో చేరాడు. అందులో పొందిన తరిఫీదుతో చిన్న వ్యాపారయ్యాడు. ఇప్పుడు ఇంత పెద్ద వ్యాపారి అయినా అతనిలో ఆనాటి కోరిక, భయం ఇంకా ఈనాటికీ వదల్లేదు. పట్టుబడతానన్న భయంతోనే వ్యాపారం చేశాడు. లాభాలు దోచుకున్నాడు. ప్రభుత్వానికి చెల్లించవలసిన పన్నులకు దొంగ లెక్కలు రాయించాడు. ఉద్యోగులకు తనకు పట్టిన జాడ్యం తగిలించి లంచగొండులను చేశాడు. ఆ ఒక్కరాత్రి అంకురించిన కోర్కె, దానివలన రేకెత్తిన భయం, అటు లచ్చిని అడుక్కునేదానిని చేసింది. తనను అయోగ్యుడ్ని చేసింది. సుఖాన్ని డబ్బుతో కొలవలేడు. రక్తపోటు, మధుమేహవ్యాధులతో, మందులతో బతుకుని పొడిగిస్తున్నాడు. తిన్నది తక్కువైనా సరిగ్గా జీర్ణించుకోలేకపోతున్నాడు.

ఆ ఇసుకపర్రమీద ఎంతసేపు కూర్చున్నా లేవబుద్ధి పుట్టడంలేదు. ముందుకు పోయే మార్గం కనుక్కోలేని అంధుడైపోయా ననుకున్నాడు. అలా లేచి కుంటివానిలా, మెల్లగా తిరిగివస్తుంటే ఒడ్డునున్న గుడి కనిపించింది. వెన్నెల్లోనూ నల్లగానే ఉంది. ఆ గుడి గమ్మం కూడా రాతిస్తంభాలతో చేసినదే. దానికి తలుపుల్లేవు. అందులో ఒక ఎత్తయిన రాతి పలకమీద అయిదు కర్ర విగ్రహాలున్నాయి. ఏడాదికి ఒకసారి జరిపించే అమ్మవారి జాతరలో వాటికి రంగులు పులిమి ఊరేగిస్తారు. ఆ రాత్రి నిశ్శబ్దంలోంచి తనకో శబ్దం వినిపించింది. ఆ శబ్దం ఈనాటిది కాదు. ఆ గొంతుక నలభయ్యేళ్ల క్రితం వినిపించింది. ఇప్పటికీ వినిపిస్తోంది. ఆ మనిషి ఏనాడో చచ్చిపోయి ఉంటాడు. ఆ గొంతు నిత్యనూతనంగా ఉంది. ఆ రోజుల్లో ఆ గొంతుక వినడానికే రోజూ చీకటిపడ్డాక ఆ రాతిమెట్లమీద కూర్చునేవాడు. ఆ అమ్మవారి పూజారి దాసయ్య. నల్లని శరీరంతో, తెల్లని జుత్తుతో ప్రమిదలో దీపం వెలిగించేవాడు. అమ్మవారి ఎదురుగా శివాలు వేసేవాడు. చివరకు లోకకళ్యాణం కోరుకునేవాడు. అతను తన కళ్యాణం కోరుకోలేదు. నాది నాదనుకోలేదు. ఆ శరీరం తనది అనుకోలేదు. అందుకే ఆ శరీరం బుగ్గయినా ఆ గొంతుక బుగ్గి కాలేదు. ఈ తలపులు తనకు కొత్త. జీవిత గమ్యం చూపించినట్లయింది. ఇన్నాళ్లూ మూసివేసిన అసలు 'కిటికీ'.. ఆ అంతరాత్మ తలుపులు తెరిచాడు. మనసులో అమృతవర్షం కురిసి కొత్త జన్మ యెత్తా ననుకున్నాడు. ■